నిరుద్యోగులకు నిరాశేనా..!

తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు ప్రతి ఇంటికో ఉద్యోగం, లేదా నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల్లో నిరుద్యోగ భృతిని మొదటి హామీగా పేర్కొన్నారు. రోజులు గడుస్తున్నా.. ఈ హామీ ఇంకా అమలు కాలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి వస్తుందని ఎంతో ఆశతో నిరుద్యోగులు ప్రతి ఇంటా ఎదురు చూస్తున్నారు.

- ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు
- ఇంకా అమలు కాని హామీ
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

సీతంపేట/మురళీనగర్: ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డుల్లో సుమారు 80,658 గృహాలు ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి ఇంట్లో ఒకరు లేదా ఇద్దరు నిరుద్యోగులు చంద్రబాబు ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారా.. అసలు చేస్తారా.. చేయారా.. చేస్తే ఎప్పటి నుంచి అమలు చేస్తారు.. ఇంటికో ఉద్యోగం ఇస్తారా.. ఒకవేళ నిరుద్యోగ భృతి ఎంత ఇస్తారు వంటి సందేహాలతో యువత సతమతమవుతున్నారు.

2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ అప్పుడు కూడా ఎన్నికల ప్రచారంలో జాబు కావాలంటే.. బాబు రావాలి, ఇంటికో ఉద్యోగం, లేదంటే ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలిచ్చింది. కానీ ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. ఇంటికో ఉద్యోగం మాట దేవుడెరుగు, కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వకుండా మొండిచెయ్యి చూపారు. గత అనుభవంతో ఈసారైనా హామీ అమలుచేస్తారా లేదా మొండి చెయ్యి చూపిస్తారా అన్న డైలమాలో నిరుద్యోగులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులకు కార్యదర్శులు, వలంటీర్లు గా నియమించిన విషయం తెలిసిందే. మరి చంద్రబాబు ప్రభుత్వం ఏమేరకు ఉద్యోగాలు కల్పిస్తుందోనని యువత ఆశగా ఎదురు చూస్తున్నారు.



యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కూటమి నాయకులు ప్రకటించిన మేనిఫెస్టో

నిరుద్యోగ భృతి లేదా ఉద్యోగమివ్వాలి



నేను చోడవరం ఉషోదయ డిగ్రీ కాలేజీలో 2011లో బీఏ జాగ్రఫీ పూర్తి చేశాను. అప్పటి నుంచి కొంత కాలం వ్యవసాయం చేశాను. తర్వాత ఒక ప్రైవేటు కాంట్రాక్టు కంపెనీలో చేశాను. ప్రస్తుతం ఖాళీగా ఉన్నాను. ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షలు రాశాను కానీ రాలేదు. మా అమ్మ ఒక్కరే ఆధారం. మా అన్నయ్య రాజమహేంద్రవరంలో కలాసీగా పనిచేస్తున్నారు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబు 5వ తరగతి, పాప అంగన్‌వాడీలో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి వచ్చేది. ఇప్పటివరకు తల్లికి వందనం డబ్బులు కూడా రాలేదు. జీవనం కష్టంగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి రూ.3000 అందించాలి. ఉద్యోగం వచ్చే వరకు భృతి ఇస్తే పోటీ పరీక్షలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– గొల్లు చిన్నంనాయుడు, మురళీనగర్

తక్షణం అమలు చేయాలి



ఎంబీఏ చేసి రెండేళ్లయ్యింది. ఉద్యోగం కోసం చాలా ప్రయత్నాలు చేశాను. నేను ఇక్కడికి వచ్చి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. ప్రస్తుతం చాలా ఇబ్బందిగా ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా నెలకు రూ.3000 నిరుద్యోగ భృతిని తక్షణం అమలు చేస్తే మాలాంటి వారికి కాస్త ఆర్థిక భరోసా కలుగుతుంది. అలాగే ఉద్యోగాలకు వయోపరిమితిని పెంచాలి.

– వి.నానాజీ, సత్యానగర్

భృతి ఇస్తే బాగుంటుంది



డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి ఉద్యోగం కోసం ఉన్న ఊరు వదిలి విశాఖ వచ్చి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. బీకాం చదివాను, యూపీఎస్సీ, ఎస్‌ఎస్‌సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. రూమ్ రెంట్, స్టడీమెటీరియల్, భోజనం, దరఖాస్తులకు ఎంతో ఖర్చవుతోంది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే చాలా సహాయంగా ఉంటుంది.

– ఎం.అమర్‌నాథ్, నిరుద్యోగి

ఉద్యోగాల కోసం జిల్లాలు దాటి..

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వేలాది మంది నిరుద్యోగులు తమ ఇళ్లు వదిలి ఉద్యోగాలు, ఉపాధి కోసం విశాఖ వంటి నగరానికి పొట్ట చేతపట్టుకుని వస్తున్నారు. అద్దె ఇళ్లల్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కొంతమంది చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నగరంలోని గ్రంథాలయాల్లో ఎంతో మంది నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఇంటి అద్దె, తిండి, కాంపిటేటివ్ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్, ఇతర ఖర్చులు కలిపి ప్రతి ఒక్కరికీ రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి ఉంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందిస్తే తల్లిదండ్రులకు కొంత భారం తగ్గించినట్టు అవుతుందని నిరుద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు, ఇతర ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరుతున్నారు. లేదంటే కోచింగ్ కోసం వేలాది రూపాయాలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊరు వదిలి వచ్చాను



మాది శ్రీకాకుళం జిల్లా. బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. రైల్వేస్, గ్రూప్–2 పరీక్షలకు ప్రిపేర్ అవడానికి విశాఖ వచ్చాను. ఏడాదిగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయానికి వచ్చి చదువుతుంటాను. గది అద్దెకు తీసకున్నాను. అద్దె, భోజనం, స్టడీ మెటీరియల్, ఇతర ఖర్చులు కలిపి నెలకు రూ.12 వేలు అవసరం. డిగ్రీ చదివి ప్రతి నెలా ఇంటి నుంచి డబ్బులు పంపించమని అడగాల్సి వస్తోంది. సూపర్ సిక్స్ పథకంలో ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎప్పుడో ఇచ్చే కంటే, త్వరగా అమలు చేస్తే బాగుంటుంది. గతంలో కూడా చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఈసారైనా పూర్తి స్థాయిలో అమలు చేయాలి.

– పి.రమణ, నిరుద్యోగి

క్లుప్తంగా

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్‌ల నుంచి సోమవారం రైళ్లు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 10.50గంటలకు హౌరాలో బయల్దేరాల్సిన హౌరా– ఎస్‌ఎంవీ బెంగళూరు (12863) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా మధ్యరాత్రి 12.50గంటలకు బయల్దేరింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి– తాంబరం (22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 26 గంటలు ఆలస్యంగా మంగళవారం రాత్రి 8 గంటలకు బయల్దేరుతుంది. సోమవారం రాత్రి 11.15గంటలకు షాలిమార్‌లో బయల్దేరవలసిన షాలిమర్ – వాస్కోడగామా (18047) అమరావతి ఎక్స్‌ప్రెస్ సుమారు 6గంటలు ఆలస్యంగా మంగళవారం తెల్లవారు 5.30గంటలకు బయల్దేరింది.

ధ్రువపత్రాల కోసం అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీరాంమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరాంమూర్తి వాటిని స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుత్వ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులతో పాటు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్‌ఐ, ఇబ్రహీం, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి చర్యలు


అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీకి 01, ఇంజనీరింగ్ విభాగానికి 02 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, వాటర్ ఏఈ మోహన్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్ గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


గ్రంథాలయాధికారి పద్మజకు పోటీ పరీక్షల పుస్తకాలను అందిస్తున్న ప్రభాకర్

మురళీనగర్: వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన తాజా పుస్తకాలను మురళీనగర్‌కు చెందిన సచివాలయం అధికారి వితరణ చేశారు. ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ అధికారి జి.ప్రభాకర్ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఈ పుస్తకాలను మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయానికి అందజేశారు. ఎస్‌ఎస్‌సీ, ఆర్‌ఆర్‌బీ, కరెంట్ అఫైర్స్, జీకేకు సంబంధించి సుమారు రూ.5,000 విలువైన లేటెస్ట్ ఎడిషన్లను ఆయన గ్రంథాలయాధికారి పద్మజకు అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా విద్యార్థులను మలచాలి


శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ అనంతలక్ష్మి

కంచరపాలెం: ఒత్తిడి లేకుండా సునాయాసంగా బోధించడంపై స్టేట్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ అనంతలక్ష్మి అవగాహన కల్పించారు. కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో రాష్ట్ర చిల్డ్రన్ క్లబ్, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్, బిఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ట్యూషన్ కేంద్రాల నిర్వాహకుల ప్రాంతీయ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. నేటి తరం విద్యార్థులు నేర ప్రవృత్తికి ఎలా అలవాటు పడుతున్నారు, వాటి ప్రమాదాలను, వాటి నుంచి వారిని తప్పించి మంచి పౌరులుగా ఎదిగేందుకు చేపట్టాల్సిన చర్యల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. విశ్వమానస సంక్షేమ సంఘం అధ్యక్షుడు మస్తాన్‌రావు మాట్లాడుతూ సమాజం బాగుంటేనే.. పిల్లలు బాగుంటారని, వారి బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ రమాప్రభ, ఎల్లాజీ, అప్పారావు, రామారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

16 మందికి ఏఐసీటీఈ ప్రగతి ఉపకార వేతనాలు


ప్రగతి ఉపకార వేతనాలు అందుకున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు

మురళీనగర్: ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) ప్రగతి ఉపకార వేతనాలకు 2023–24 సంవత్సరానికి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలో చదువుతున్న 16 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచి నుంచి బి.హర్షిణి, పి.లక్ష్మిప్రియ, ఎస్.శృతి, డి.భూపేశ్వరి, జి.దివ్యశ్రీ, ఎం.స్నేహ, కె.శ్రీయ, టి.మౌనిక మహాలక్ష్మి, ఎం.అలేఖ్య, పి.మౌళిక, ఎన్.కుషి, పి.అపురూప, ఎం.దిల్‌షాద్, ఎస్.ఆసీఫా సుల్తాన్, మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచి నుంచి వి.హాసిని, ఎస్.ఉజ్వల ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50,000 చొప్పున ఉపకార వేతనం ఏఐసీటీఈ మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన బాలికలను ప్రిన్సిపాల్ నారాయణరావు, ఎలక్ట్రికల్ హెడ్ కేడీవీ నరసింహారావు, మెకానికల్ హెడ్ కె.మధుకుమార్ అభినందించారు.

బీజేపీ కార్యాలయానికి మంత్రుల రాక


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుటుంబ సభ్యులతో శ్రీనివాసవర్మ, సత్యకుమార్, ఎంపీ పురందేశ్వరి

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు నివాసానికి సోమవారం కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తోపాటు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి వచ్చారు. వారికి ఎమ్మెల్యే భార్య సీత సుజాత, కుమార్తె శ్యామలాదీపిక, అల్లుడు సునీల్ అగర్వాల్, కుమారుడు పృథ్వీరాజు ఘనంగా స్వాగతం పలికారు. కొద్ది సేపు కుటుంబ సభ్యులతో వారు గడిపారు. అనంతరం బీజేపీ ఉత్తర కార్యాలయాన్ని సందర్శించిన వారిని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులతోపాటు పార్టీ నాయకులు కలిశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో కేంద్ర ఉక్కు సహాయ మంత్రి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చర్చించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉపాధి అవకాశాలు


శిక్షణ పొందిన విద్యార్థులతో పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు

మురళీనగర్: చదువులో రాణించడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఉపాధి అవకాశాలు వస్తాయని కంచరంచపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. కాలేజీలోని స్కిల్ హబ్‌లో సోమవారం ప్రపంచ నైపుణ్యాభివృద్ధి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారిలోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు తమ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలేజీ ప్రాంగణంలోని స్కిల్ హబ్ ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ ఆపరేటింగ్, ఎలక్ట్రికల్ శిక్షణ పొందిన 19 మందికి సర్టిఫికెట్లను నారాయణరావు అందించారు. కార్యక్రమంలో కాలేజీ ఎలక్ట్రికల్ విభాగం హెడ్ కేడీవీ నరసింహారావు, స్కిల్ హబ్ ట్రైనర్ సుబ్రమణ్యేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డీఎస్‌డీవో సాయికృష్ణ చైతన్య, స్కిల్ హబ్ ఇన్‌చార్జి టి.లక్ష్మి పాల్గొన్నారు.

బర్మా కాందిశీకుల సమస్యలు పరిష్కరించాలి


కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందిస్తున్న అరుణ్‌బాబు

కంచరపాలెం: భూకబ్జాదారుల నుంచి ఆంధ్ర, బర్మా కాందిశీకులకు ప్రభుత్వం అందించిన భూములను కాపాడాలని కాందిశీకుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి గునుపూడి అరుణ్‌బాబు కోరారు. సోమవారం విశాఖకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను సర్క్యూట్ హౌస్‌లో కలిసి వినతిపత్రం అందించారు. బర్మా కాందిశీకుల సమస్యలను వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు అరుణ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కనీస అభ్యసన స్థాయి సాధించాలి


విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

మురళీనగర్: విద్యార్థులు కనీస అభ్యసన స్థాయిలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. ఉపాధ్యాయులకు బోధనాభ్యసన ప్రక్రియలపై ఇటీవల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ మేరకు పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియలు ఎంత వరకు ఫలితాలు ఇస్తున్నదీ పరిశీలించే క్రమంలో మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలను డీఈవో సోమవారం సందర్శించారు. సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావుతో కలిసి ఆమె విద్యార్థుల బోధనాభ్యసన స్థాయిలను పరిశీలించారు. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం వంటి అంశాల్లో విద్యార్థుల ప్రతిభను అంచనా వేశారు. నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులు దిద్దుతున్నదీ? లేనిదీ? ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రతిభా ఆధారిత బోధన అమలు చేయాలని హెచ్‌ఎం బి.హేమలతకు సూచించారు.

భక్తి గీతాల పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: రచయిత్రి పి.వి.పద్మిని రచించిన 108 భక్తి, లలిత గీతాల పుస్తకావిష్కరణ సభ సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి, అతిథులు దాడి సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మిని రచించిన గీతాలను గాయనీ గాయకులు ఆలపించి అలరించారు. కోరుకొండ రంగారావు, రూపవాణి, చింతా ప్రభాకర్, తాళాభక్తుల లక్ష్మీప్రసాద్, లతారాములు, ఎంవీఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శం


మురళీమోహన్‌రావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌ను సోమవారం సాయంత్రం వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆకస్మికంగా సందర్శించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా వాకర్ వి.మురళీమోహన్‌రావు పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా ఈ క్లబ్‌కు విచ్చేశారు. క్లబ్ ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలుసుకుని క్లబ్ కార్యవర్గంతోపాటు ఇక్కడి సభ్యులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల నిర్వహణలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వాకర్స్ క్లబ్ నుంచి ఎంజీఎఫ్‌గా చేరిన క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజును వాకర్స్ జిల్లా 101 గవర్నర్ రంగారావు సత్కరించారు. రీజినల్ కౌన్సిలర్ నందూరి రామకృష్ణ, కార్యదర్శి ప్రదీప్‌కుమార్ వాకర్స్ క్లబ్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు. అతిథులను క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జిల్లా–101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, జిల్లా కేబినెట్ కార్యదర్శి బి.సత్యనారాయణ, పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలిపారు. కార్యక్రమంలో జిల్లా–101 పూర్వ గవర్నర్ పి.అర్జునుడు, ఉపాధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, మళ్ల రామకృష్ణ, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, టి.వి.రమణ, వి.అప్పారావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9 కిలోల గంజాయి స్వాధీనం


రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాలు... రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై సోమవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఎండీ ఉస్మాన్‌భాషా, అబ్రార్ ఉల్హక్‌ల లగేజీలను తనిఖీ చేయగా సుమారు రూ.45వేలు విలువైన 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు అరకు నుంచి విశాఖ స్టేషన్ మీదుగా గంజాయిని బెంగళూరుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. గంజాయి సీజ్ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ అధికారులు తెలిపారు.

ఎండాడలో పాము కలకలం


స్థానికులు పట్టుకున్న నాగుపాము

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల రాజీవ్‌నగర్‌లో సోమవారం ఉదయం నాగుపాము కలకలం రేపింది. ఇది కొండ ప్రాంతం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పాములు నివాసాల్లోకి చొచ్చుకుని వస్తున్నాయి. నాగుపాము ఓ ఇంటిలోకి రావడంతో స్థానిక యువకులు చాకచక్యంగా పట్టుకుని జన సంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టారు.